# ఈ ప్రపంచం నీకు ఎన్నో కలల్ని ఇచ్చింది

'అభిజిత్ పని అయిపోయింది!'

పత్రికల్లో టీవీ ఛానల్స్‌లోనే కాదు టాలీవుడ్‌లో ప్రతిచోటా మార్మోగుతోన్న వ్యాఖ్యానం అది !

అవి వింటున్నాడు. చూస్తున్నాడు. వింటూ చూస్తున్నాడు. చూస్తూ వింటున్నాడు అభిజిత్. తట్టుకోలేకపోతున్నాడు. దు:ఖాన్ని 'మందు'తో బాటు మింగెయ్యాలని విఫలయత్నం చేస్తున్నాడు.

రెండు యావరేజ్‌లు ఒక సూపర్ హిట్ మూడు ఫ్లాపులు ఒక అట్టర్ ఫ్లాప్ - ఇదీ అతడి సినిమా కెరీర్.

పాత్రల్లో జీవించే నటుడన్నారు. లవ్వర్ బోయ్ అన్నారు. రేపటి స్టార్ అన్నారు. అన్నీ.ఎవరో ఉఫ్‌మని ఊదినట్టు నీటి బుడగల్లా పేలిపోయాయి.

కేవలం నటుడే అయివుంటే ఇంతగా కృంగిపోయే వాడు కాదేమో. కాని క్రితం వారం గొప్ప ఫ్యాన్ ఫేర్‌తో విడుదలైన చిత్రానికి అతడు సహనిర్మాత. నిజానికతడు నిర్మాతగా మారదామనుకోలేదు. సినిమా కొంత షూటింగయ్యాక కొత్త మార్పులు తలపెట్టారు. ఆస్ట్రేలియాలో షూటింగ్ చేద్దామనుకున్నారు. ఎలాగూ అక్కడికెళ్తున్నప్పుడు కొన్ని సీన్లు అక్కడ తీస్తే రిచ్‌గా వుంటుందని భావించారు.

దర్శకుడి మీద నమ్మకం పెరిగింది. కాని నిర్మాత చేతులెత్తేశాడు. తన చిత్రాల్లో కెల్ల భారీ చిత్రం అవుతుందని సంబరపడుతోంటే బ్రేకు పడేలా వుందని భయపడ్డాడు.

ఒకరిద్దర్ని సలహా అడిగాడు. 'నిర్మాత చెప్పుల్లో నువ్వు కాళ్ళు పెట్టేయ్ ఏనుగు కుంభస్థలాన్ని కొట్టేయడం ఖాయం' అన్నారు.

బరిలోకి దూకాడు. బడ్జెట్ మరింత పెరిగింది. షూటింగ్ ప్రారంభించడానికి సిద్ధంగా వున్నాయి రెండు కొత్త ప్రాజెక్టులు. వాటి దన్ను చూసి వెన్ను తట్టుకున్నాడు. దొరికిన కాడల్లా అప్పు చేశాడు. గొప్పగా పబ్లిసిటీ ఇచ్చారు.

'తల తిక్క సినిమా' అనేసి తిరస్కరించేశారు ప్రేక్షకులు. అతి కష్టం మీద రెండో రోజు ఆడించగలిగారంతే.

ఆ సునామీలో క్లాప్ కొట్టిన సినిమా షెడ్యూలూ, పూజ చేయాల్సిన మరో సినిమా ప్రారంభోత్సవమూ కొట్టుకు పోయాయి.

అభిజిత్ డిప్రెస్ అయ్యాడు. ఇంటికే పరిమితమయ్యాడు.

"నో! నా పని అయిపోలేదు. మళ్ళీ లేస్తాను. ఫీనిక్స్‌లా బూడిదలోంచి లేచి వస్తాను. ఖబడ్దార్... ఒరే మీరంతా ఖబడ్దార్... వచ్చే... స్తా...!" దభీమని సోఫాలో కూలబడ్డాడు.

అతడితో గ్లాసు కలిపిన ఇద్దరు మిత్రులూ బాధగా సానుభూతిగా చూశారతడిపంక.

"ఆ సినిమా జోలికి పోకుండా ఉంటే బావుండేది" ఒకడన్నాడు.

"కర్ణుడిచావుకి సవాలక్ష కారణాలని మన వాడికీమధ్య తలబిరుసు పెరిగిందిలే.లోపలెలా వున్నా పైకి వినయవిధేయతలు ఎగ్జిబిట్ చెయ్యకపోతే ఇండస్ట్రీ సహించదు" రెండో వాడన్నాడు.

"అది హిట్టయితే మన వాడి పొజిషన్ మారి పోద్దని ఓ యువ హీరో తండ్రి మంచి థియేటర్లు దొరకనివ్వలేదంటున్నారు. నిజమేనంటావా!"

"అసలు కథలో ఊపిరే లేదు. ఎంతసేపని కొట్టుకుంటుందీ!"

"ప్చ్.. బ్యాడ్‌లక్... పద పోదాం..."

కట్టెలా పడివున్న అభిజిత్‌కి బై చెప్పి తూలుతూనే వెళ్ళిపోయారిద్దరూ.

ఆ మర్నాడు పల్లె నుంచి అతడి తల్లి విశాలాక్షి వచ్చింది. ఆమెని కావలించుకుని బావురుమన్నాడు.

"ఇప్పుడేమయ్యిందనిరా !" అతడి జుట్టులోకి వేళ్ళు జొనిపి నిమురుతూ లాలనగా అంది.

"ఎవ్విరి థింగ్ ఫినిష్డ్"

"ప్రపంచం అంతమై పోయిందా?"

వెర్రిగా చూశాడు.

"పిచ్చి నాన్నా, నీకు ఈ ప్రపంచమే కలలిచ్చింది . వాటికి రంగుల రెక్కలూ

ఇచ్చింది. వాటిని సాకారం చేసుకోడానికి మార్గాలూ చూపింది. నువ్వు చేయాల్సిందల్లా ఆ మార్గాల్లో ప్రయాణించడమే !"

" కాని.... కాని....."

"కానీలు కాదు కార్యాచరణ కావాలి. హీరో కావాలనుకున్నావు. అయ్యావు. స్టార్ కావాలనుకున్నావ్. స్టార్స్ కలిసి రాలేదు. అలాగని పట్టిన పట్టు వదలొద్దు. మరింత గట్టిగా పిడికిలి బిగించు. నీకెదురు నిలిచిన శక్తులన్నీ తోక ముడుస్తాయి. సలాం చేస్తాయి"

"నీకు తెలీదు మామ్ ఇది మాయా ప్రపంచం !"

"జగమే మాయేమో!" నవ్వింది.

నిర్విణ్ణుడై చూశాడు.

"తలంటుకుందువు గాని లే... అన్నీ పోయినా ఫర్లేదురా కన్నా, ధైర్యాన్ని వీడకుండా ఉంటే చాలు. చిన్నప్పుడు చదివిన ధైర్యలక్ష్మి కథ గుర్తుచేసుకో.... రా...."

నిజమే అన్పించింది అభిజిత్‌కి. తను అధైర్య పడితే ముఖం చాటేస్తే ఎన్నో రూమర్లు పురుడు పోసుకుంటాయి. చేజేతులా కెరీర్ నాశనం చేసుకున్నట్టవుతుంది.

"నీ మాటల్లో టానిక్స్ ఉన్నాయి మామ్.."

"తల స్నానం చేసిరా ఈలోగా పూజా మందిరం సర్దుతాను.."

" ఓకే మామ్"

నిష్ఠగా పూజ చేశాడు. కొత్త ఉత్సాహం వచ్చింది.

హాల్లో గోడకి ఓ చార్ట్ అంటించింది తల్లి. దాని మీది కొటేషన్ చదివాడు.

'క్విట్టర్స్ నెవర్ విన్. విన్నర్స్ నెవర్ క్విట్'

"ఫెంటాస్టిక్ మామ్. యూ ఆర్ గ్రేట్ !"

"రా కూర్చో..." డైనింగ్ చెయిర్ లాగింది.

ఇద్దరూ టిఫిన్ చేస్తూండగా అంది "చిన్నప్పుడు వైకుంఠపాళీ ఆడే వాడివి గుర్తుందా? అందులో నిచ్చెన్లే కాదు పాములూ వుంటాయి..."

అవునన్నట్టు తలాడించాడు.

"పరాజయాలనేవి నీతోనే మొదలవ్వలేదు. నీతోనే అంతమవబోవటమూ లేదు. అలనాటి ఎన్టీఆర్ నుండి ఈనాటి కుర్ర హీరోల వరకూ అంతా ఏదో దశలో ఆ

'దశ'లో కెళ్ళినవారే. అంతెందుకూ ఫ్లాపుల పరంపర తట్టుకోలేకే కదా అప్పట్లో చిరంజీవి రెండేళ్ళపాటు ముఖానికి మేకప్ వేసుకోలేదు"

"వాళ్ళ పరిస్థితి వేరు మామ్. వాళ్ళు ఎస్టాబ్లిష్ట్ స్టార్స్. నేను బడ్డింగ్ యాక్టర్ని" అతడి స్వరం వణికింది.

"నీతో పాటు ఎందరో యువకులు హీరోలవుదామని పరిశ్రమకొచ్చారు. కాని నీలాంటి కొందరే కదా హీరోలయ్యింది! నీకొక సూపర్ హిట్ సినిమా వుందన్న సంగతి మరచిపోకు"

"అది ఫ్లూక్ అంటున్నారిప్పుడు"

"కాదని నిరూపించుకో"

"ఎలా ?"

"పట్టుదలతో ఆత్మవిశ్వాసంతో సాధన చెయ్యి "

"ఇది సినిమా ఫీల్డ్ మామ్. ఒక్క దెబ్బ తగిలితే చాలు మటాష్!"

"దెబ్బ తగిలిందని ఆట ఆపెయ్యాలంటావ్?"

"ఆపక ?"

చిన్నపిల్లాడ్ని చూసి నవ్వినట్టు నవ్వింది. "ఆడే పద్ధతి మార్చు. వీలైతే సాధనాలూ మార్చు. అవసరమనుకుంటే కోచ్‌లనూ మార్చు. అంతేగాని ఆటని మార్చకు. ఆటలోంచి తప్పుకోకు!"

ఆలోచనలో పడ్డాడు అభిజిత్

"వినూ కలిసిందా ?"

తల్లి ప్రశ్నకు తడబడ్డాడు "లేదు లేదు. ఎంచేతో తను ఫోనూ చెయ్యలేదు"

"నువ్వు చెయ్యొచ్చుగా "

"చెయ్యొచ్చు కానీ....!"

"న్యూనత వదిలించుకోరా కన్నా. వినూ నీ వుడ్ బీ. ఆమె తండ్రి బిజినెస్ మాగ్నెట్. ఆయన తలచుకుంటే నీతో వరసబెట్టి సినిమాలు తీయలేరా?"

అతడి ముఖంలోకి వెలుగు త్రోసుకొచ్చింది.

"అఫ్‌కోర్స్...!"

"ఇంకా ఈ నాన్చుడేవిట్రా యాక్షన్లోకి జంప్ చేయక!"

"థాంక్యూ మామ్!"

చెయ్యి తుడుచుకుని నేప్‌కిన్ విసిరేసి మేడమీది తన గదిలో కెళ్ళిపోయాడు అభిజిత్.

మెట్లమీంచి పైకెళ్తోన్న కొడుకు వంకే చూసి చూసి నిట్టూర్చింది విశాలాక్షి.

ఆమెకి తన భర్త గుర్తొచ్చాడు.

అతడు చాలా అందంగా వుండేవాడు. ఉద్యోగం చేస్తూనే నాటకాలపిచ్చితో తిరిగేవాడు. ఉత్తమ నటుడి షీల్డుల్తో బీరువా నిండిపోయింది. సినిమాల్లో కెళ్ళమని మిత్రులు ప్రోత్సహించారు. మద్రాసు వెళ్ళాడు. ఆశానిరాశల మధ్య వేలాడుతూ చిన్నచిన్న వేషాలు వేశాడు. ఎక్స్ట్రాగానూ నటించాడు.

"మీకు దూరంగా ఉండలేకపోతున్నాం. తిరిగొచ్చెయ్యండీ. మన అభి పుట్టాక మీరు వాడి ముఖం కూడా చూడలేదు..." అని ప్రాధేయపడింది.

"నాకూ వాడిని చూడాలనెంతో తహతహగా వుంది. కాని హీరో అవ్వకుండా రాలేను. వాడి ముఖం చూడలేను. ఒకవేళ నాకేమైనా అయితే వాడ్ని హీరోని చెయ్యి..."

"అవేం మాటలండీ..."! అంటూ ఏడ్చేసింది.

చిత్రంగా ఆ మర్నాడే హీరో పాత్రకి ఎన్నికయ్యానని కొండంత సంబరంతో ఫోన్‌చేసి చెప్పాడు. పొంగిపోయింది. ఒక సారొచ్చి బాబుని చూసి వెళ్ళమంది.

"వీళ్ళకి అందుబాటులో లేకపోతే క్షణాల్లో ఎలాంటి ఛేంజ్ అయినా చేసేస్తారు. తర్వాతొస్తాన్లే" అన్నాడు.

షూటింగ్ కేరళ సముద్ర తీరంలో మొదలైంది. నాలుగో రోజున ఎత్తయిన బండల మీద నిలబడి షూటింగు చేస్తోంటే కాలు జారి సముద్రంలో పడి...!

దుఃఖం వెల్లువెత్తగా డైనింగ్ టేబుల్ మీద పడి బావురుమంది విశాలాక్షి.

అంతలోనే గుండె దిటవు చేసుకుంది.

అప్పుడూ ఇలాగే ధైర్యాన్ని కూడదీసుకుంది. టీచర్ ఉద్యోగం చేస్తూనే అభిజిత్‌ని చదివించింది. నాట్యం నేర్పించింది. నటనలో శిక్షణ ఇప్పించింది. అతడు తండ్రి కలని స్వంతం చేసుకున్నాడు. శ్రమించాడు. సాధించాడు.

కానింతలో ఓడలు బళ్ళయ్యాయి.

కళ్ళు తుడుచుకుంది విశాలాక్షి.

గదిలో అభిజిత్ వినూష కోసం ఫోన్లో విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు.

ఆమె ఓ డిస్కోథెక్‌లో పేజ్‌త్రీ పీపుల్తో బాటు కలిసింది. తన అభిమానినంది. తనూ ఫ్లాటయ్యాడు. పరిచయం స్నేహాన్ని దాటి ప్రేమగా మారింది. షికార్లూ చిందులూ పెరిగాయి.

వాళ్ళింట్లో తెలిసింది. తనని పిలవగా వెళ్ళి కలిశాడు. అంతా హ్యాపీ. మామ్‌తో మాట్లాడారు. శ్రావణంలో నిశ్చితార్థం మాఘంలో పెళ్ళి అనుకున్నారు. తమకి రెక్కలొచ్చాయి. వీను వీధుల్లో చక్కెర్లు కొడుతున్నారు. ఇంతలో....!

వినూకి ఏమయ్యిందో అర్థం కాలేదు. మరి భరించలేక పిఏ ని పిలిచాడు. అంతలోనే అతడు రిజైన్ చేసి వెళ్ళిపోయిన సంగతి గుర్తొచ్చింది.

పెదవి కొరుక్కుంటూ చకచకా మెట్లు దిగాడు. మరి రెండు నిమిషాలకి కారు స్టార్టయి దూసుకుపోయింది.

తిన్నగా వినూష వాళ్ళింటికెళ్ళాడు. ఎవరూ ఆహ్వానించలేదు. వినూష సింగపూర్ వెళ్ళిందన్నారు. అయోమయంగా చూస్తోంటే వినూష బాబాయి వచ్చి భుజంమీద చెయ్యి వేసి "వినూని మరిచిపో" అని చెప్పి భుజం తట్టి కారెక్కించాడు.

ఎలా డ్రైవ్ చేసుకుంటూ ఇంటికొచ్చాడో అతడికే తెలీదు. తిన్నగా తన గదిలోకి వెళ్ళి తలుపేసుకున్నాడు.

తల్లి భయపడుతూ వచ్చి తలుపు బాదింది.ఆ సరికే గుప్పెడు నిద్రమాత్రలు మింగేశాడతడు !

* * *

ఆసుపత్రి బెడ్ మీద నీరసంగా పడుకుని ఉన్నాడు అభిజిత్.

"నేనింత పిరికివాడ్ని కన్నాననుకోలేదు. మీ నాన్న పోయినప్పుడు నేనూ ఆత్మహత్యే మార్గమనుకుని వుంటే నువ్వేమై పోయేవాడివిరా ?" కంపిత స్వరంతో ప్రశ్నించింది.

తలొంచుకున్నాడు.

"ఒక ఎదురుదెబ్బ తగిలిందని ఒక నిరాశ ఆవరించిందని ఒక పరాజయం తొంగి చూసిందని అంతం చేసుకునేంత అల్పమైంది కాదురా జీవితం. ఏ కష్టమూ ఏ కన్నీరూ ఏ అపజయమూ శాశ్వతం కానే కాదు. ఓటమి నుంచి నేర్చుకోవాల్సింది

దిగాలు పడి కూర్చోవడం కాదు ఇంకా గెలవలేదని మాత్రమే. పిచ్చినాన్నా! ఇవాళ నీది కాకపోవచ్చు కాని రేపు నిస్సందేహంగా నీదే!"

"సారీ మామ్ "

"నాక్కాదు నీ అభిమానులకి చెప్పు..."

హాస్పిటల్ బయట గుమిగూడి వున్న సుమారు వంద మంది అభిమానుల వంక అభిమానంగా చూశాడు. చెమ్మగిల్లిన కళ్ళతో చూశాడు. ఉత్సాహంగా చేతులూపాడు. వాళ్ళు ఆనందాతిశయంతో కేకలు పెట్టారు!

* * *

ఇదివరకు తనతో చిత్రాలు నిర్మిస్తానన్న నిర్మాతల ఆఫీసులకెళ్ళి కలిశాడు అభిజిత్. సిగ్గు విడిచి వేషం ఇమ్మని అర్థించాడు.

"నీకు మార్కెట్ లేదుగా" అన్నారు. పెద్ద నిర్మాణ సంస్థల్ని కలిశాడు. సపోర్టింగ్ పాత్రనైనా వేస్తానన్నాడు. అవకాశం ఉంటే తప్పక పిలుస్తామన్నారు. వివిధ ప్రొడక్షన్ మేనేజర్ల ఫోన్ నెంబర్లు సేకరించి కాంటాక్ట్ చేశాడు. కొందరు చూస్తా మన్నారు మరికొందరు తెలియనట్లుగా మాట్లాడారు.

తనతో తిని తాగి తిరిగే మిత్రులూ మంత్రించినట్టు మాయమైపోయారు.

చూస్తుండగానే ఏడాది గడచి పోయింది. తెలుగు సినీ పరిశ్రమ అభిజిత్‌ని మరచిపోయింది. కాని అప్పుల వాళ్ళు మరచిపోలేదు. ఒత్తిడి పెంచారు.

అయినా తల్లి ధైర్య వచనాలకి బింకంగా ఉన్నాడు. ఇల్లు వేలం వేస్తామంటూ బ్యాంకు నుంచి నోటీసు వచ్చింది.

బరస్టయ్యాడు. అతడు తిరిగి మామూలు మనిషవ్వడానికి వారం రోజులు పట్టింది.

నిరాశగా పరధ్యానంగా వుంటున్న కొడుకుని చూచి చలించి పోయింది విశాలాక్షి.

"ఇదేవిట్రా. ఆప్టిమిస్టిగ్గా ఉండాలి గాని..."

"ఇంకేం మిగిలిందనీ !"

"ఆత్మవిశ్వాసం!"

"అదీ పోయింది"

"పోనివ్వకు. నువ్వు నటుడివి. నీ మన: ప్రభావం నీ ముఖం మీద పడితే కెరీర్‌కి చాలా ప్రమాదం వస్తుంది "

"రానియ్ మామ్ నేనిప్పుడు కలల గమ్యం కోల్పోయిన జీవశ్చవాన్ని!"

"షటప్. కాలం ఎప్పుడూ ఒకే రీతిలో ఉండదు. పరిస్థితులు ఎంత మంచివైనా, చెడ్డవైనా మారకుండానూ వుండవు. మార్పు ప్రకృతి లక్షణం"

"అవును నా ఈ మార్పు అగాధాల్లోకే !" ఏడ్చేశాడు.

"అభీ ! సిగ్గులేదా ఆడపిల్లలా ఏడ్వడానికి. నువ్వింకా గాడిన పడలేదంటే నీ ప్రయత్నలోపం ఉందేమో చెక్ చేసుకో. నీ శక్తులను పదునుపెట్టుకో. భారతం చదివావు కదా. అరణ్యవాసం చేయాల్సొచ్చింది. పాండవులేం చేశారు? నుదుటి రాతని తిట్టుకుంటూ కూర్చోలేదు. మరిన్ని అస్త్రశస్త్రాలు సమకూర్చుకున్నారు. కురుక్షేత్ర సంగ్రామానికి సర్వవిధాలా సన్నద్ధమయ్యారు! "

"నీకింకా నామీద నమ్మకముందా మమ్మీ ?"

"నా గుండె పట్టనంత వుంది !"

అతడు తల పంకించాడు. ఆ రాత్రంతా తల్లి మాటల గురించి పరి పరి విధాల ఆలోచించాడు.

మర్నాడు ఓ టీవీ ఛానల్లో పని చేస్తున్న పరిచయస్తుడికి ఫోన్ చేసి, "టీవీలో పని చెయ్యడానికి నేను రెడీయే. మంచి అవకాశాలుంటే చెప్పు" అని కోరాడు.

మరి రెండు గంటల్లో ఆ ఛానల్ తాలూకు ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్స్ అతడ్ని వెదుక్కుంటూ ఇంటికొచ్చారు.

"ఒక కొత్త గేమ్ షో స్టార్ట్ చెయ్యబోతున్నాం. మీరు యాంకరింగ్ చెయ్యాలి. సెలక్టయిన అభ్యర్థుల్ని జీకే క్వశ్చన్స్ అడగటమన్నమాట. ఫైవ్‌లాక్స్ ప్రైజు మనీ పెట్టాం. వారానికి అయిదు ఎపిసోడ్లు ప్రసారం చేస్తాం. మొదటి ఫేజ్‌లో 100 ఎపిసోడ్స్ ప్లాన్ చేస్తున్నాం. ఒక్కో ఎపిసోడ్‌కీ మీకు లక్ష ఇవ్వగలం "

అతడేమీ ఆలోచించలేదు." అగ్రిమెంట్ పేపర్లు తెచ్చారా ?"

రాతకోతలైన మరుక్షణం నుంచీ అతడి దినచర్య మారిపోయింది. ఇంగ్లీషు హిందీల్లో వచ్చిన ఆ తరహా గేమ్‌షోలని క్షుణ్ణంగా పరిశీలించాడు. అద్దం ముందు కూర్చుని రకరకాల హావభావాలు ప్రదర్శిస్తూ ప్రాక్టీసు చెయ్యసాగాడు.

ఒకరోజున తల్లిని కూర్చోబెట్టి రకరకాల ప్రశ్నలు అడిగాడు. రివాల్వింగ్ చెయిర్లో కూర్చుని తిరుగుతూ మొనాటనీ అన్పించకుండా రకరకాల హావభావాలు ప్రదర్శించాడు. నవ్వాడు. జోక్స్ వేశాడు. ఆహ్లాద వాతావరణం కల్పించాడు.

"ఎలా వుంది మమ్మీ !"

"బావుందిరా. కానీ నువ్వేదో కించపడుతున్నట్టూ నీకు నువ్వు తక్కువగా భావించుకుంటున్నట్టూ అన్పించింది. అలా వద్దు. అభ్యర్థుల కన్నా నీకు కాన్ఫిడెన్సు పది రెట్లు అధికంగా వుండాలి. పెద్ద తెర నుంచి బుల్లి తెరకొచ్చానని గానీ, మరో దారి లేక చేస్తున్నానన్న భావన కానీ నీలో వుంటే దాన్ని సమూలంగా తుంచి పారెయ్. ప్రతిభకి కొలబద్ద కేవలం ప్రతిభ మాత్రమే !"

"యూ ఆర్ కరెక్ట్ మామ్. ఆ ఫీలింగ్సుని అధిగమిస్తాను. ఛాలెంజ్‌గా తీసుకుంటాను. ఎట్టిపరిస్థితుల్లోనూ ఓటమి అంగీకరించను. పట్టిన పట్టు విడువను. దిసీజ్ మై ప్రామిస్ మామ్! "

"నీ టాలెంట్ నాకు తెలుసురా" కొడుకు నుదుట ముద్దు పెట్టుకుంది.

గేమ్ షో చిత్రీకరణ మొదలైంది. మొదట టెన్షన్ పడ్డా తర్వాత ఎంతో చక్కగా సరదాగా హుందాగా రక్తి కట్టించాడు.

పెద్ద బ్యాంగ్‌తో టెలికాస్ట్ అయ్యింది.

అభిజిత్ తన కంచు కంఠంతో నిశితమైన చూపులతో సెన్సాఫ్ హ్యూమర్తో అభ్యర్థుల పట్ల స్నేహ భావంతో అద్భుతంగా రాణించాడు. ప్రశంసలు వెల్లువెత్తాయ్. టీఆర్పీ ఎక్కడికో దూసుకుపోయింది.

అతడితో సినిమా తీయాలని ఒకరిద్దరు నిర్మాతలు ఉత్సాహపడ్డారు. కాని బుల్లి తెర మీద రోజూ కన్పిస్తున్న వాడ్ని చూడటానికి టిక్కెట్లు కొనుక్కొని మరీ థియేటర్లకి ఎవరొస్తారని వెనుకంజ వేశారు.

ఇంతలో సౌత్ ఇండియన్ స్టార్ డైరెక్టర్ రత్నమణి ఆఫీసు నుంచి ఫోన్ వచ్చింది. వెంటనే కలవమన్నారు.

ఫ్లయిట్‌లో వెళ్ళడానికి చేతిలో డబ్బు లేదు. టీవీ వారిస్తోన్న డబ్బంతా అప్పుల వారికిచ్చేస్తున్నాడు. నిజానికా సొమ్మే అతడి ఇంటి వేలాన్ని ఆపు చేసింది.

"ట్రెయిన్లో వెళ్ళరా "

"ఫ్యాన్స్ చూస్తారు మమ్మీ..."

"జాలిగా చూడకపోతే చాలనుకో "

మరేమీ ఆలోచించకుండా ట్రెయిన్లో చెన్నై వెళ్ళాడు.

రత్నమణి అతడికి మేకప్ టెస్ట్ చేశాడు. కథతో గాని పాత్రలతో గాని అతడు రాజీ పడడు. అందుకే అతడి సినిమాల్లో స్టార్లు కన్పించరు. పాత్రలే కన్పిస్తాయి. అతడి శైలి, టేకింగ్ విభిన్నమైనవి. అతడి సినిమాలో నటిస్తున్నారంటే చాలు జాతీయ గుర్తింపు వచ్చేస్తుంది !

అతడు తమిళ, తెలుగు భాషల్లో నిర్మిస్తోన్న ద్విభాషా చిత్రంలో అభిజిత్ హీరోగా ఎన్నికయ్యాడు.

ఎడ్వాన్స్ తీసుకొని కార్లో ఎయిర్ పోర్టు కెళ్తూ తల్లికి ఫోన్ చేశాడు.

"ఐ గాటిట్ మమ్మీ!"

"పట్టువదలని విక్రమార్కుడికి పడినా ఉవ్వెత్తున లేచిన కెరటానికి స్వాగతం చెప్పడానికి ఎయిర్‌పోర్టు కొస్తానా అభీ !"

(ఆంధ్రభూమి వారపత్రిక 20.6.2013)